పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

A.C.O - 9003200801
S.R - 9551168092

ఆంధ్రజ్యోతి చిరునామా : జి4, గ్రౌండ్ ఫ్లోర్, రామ్స్ అపార్ట్‌మెంట్, ఓల్డ్ నెం. 40, న్యూ నెంబర్ 35, విజయ రాఘవ రోడ్డు, టి.నగర్, చెన్నై - 600 017



శాసనసభలో ప్రసంగిస్తున్న సీఎం ఎంకే స్టాలిన్

పరువు హత్యల నిరోధానికి
ప్రత్యేక చట్టం

- జస్టిస్ కేఎన్ బాషా నేతృత్వంలో కమిటీ
- అసెంబ్లీలో సీఎం స్టాలిన్ ప్రకటన

చెన్నై, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పరువు హత్యలను నిరోధించే దిశగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేఎన్ బాషా నేతృత్వంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. ఆ కమిటీ సిఫార్సుల మేరకు పరువు హత్యల నిరోధానికి ప్రత్యేక చట్టం తీసుకువస్తామని వెల్లడించారు.. శాసనసభలో శుక్రవారం ఉదయం ఆయన మాట్లాడుతూ.. కొంతమంది ఎమ్మెల్యేలు రాష్ట్రంలో పరువు హత్యలు పెరుగుతున్నాయని, వాటిని నిరోధించేందుకు చర్యలు చేపట్టాలని గురువారం సభలో విజ్ఞప్తి చేశారని, వారి కోరిక న్యాయమైనదేనన్నారు. పుట్టే ప్రతి జీవికి రక్షణ కల్పించాలని తిరువళ్లువర్ సూక్తిని డీఎంకే ప్రభుత్వం ఎల్లప్పుడు పాటిస్తుందని తెలిపారు. కులాలు, జాతులు లేవని ఎంతోమంది తమిళ కవులు కూడా ప్రజల మధ్య సమైక్యతను పెంపొందించే దిశగా ప్రకటన చేశారని, ఓ వైపు కులాంతర వివాహాలు, మతాంతర వివాహాలు, ఆదర్శ వివాహాలు జరుగుతున్నా, మరో వైపు ఈ వివాహాలు చేసుకున్న బలహీనవర్గాలకు చెందినవారు హత్యకు గురవడం విచారకరమన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్నవారు పరువు హత్యకు గురవుతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. జాతులకు, మతాలకు ఇచ్చే ప్రాధాన్యం తమిళభాషకు, తమిళ సంతతి, సంస్కృతికి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. విద్యాలయాల్లో కులాలకు ప్రాధాన్యం ఉండకూడదనే వాటిపేర్లను తొలగించామన్నారు. ఏ నాగరిక సమాజం ఒకరినొకరు కత్తులు దూసుకుని హత్యకు పాల్పడటాన్ని సహించదన్నారు. ఈ పరిస్థితుల్లోనే పరువు హత్యలను నిరోధించేందుకు ప్రత్యేక చట్టం తీసుకువస్తామని, ఆ దిశగా జస్టిస్ కేఎన్ బాషా నాయకత్వంలో విచారణ సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నామని స్టాలిన్ ప్రకటించారు.

మదురై మేయర్ రాజీనామాకు
కౌన్సిల్ ఆమోదం



సమావేశంలో వాగ్వాదానికి పాల్పడుతున్న డీఎంకే, అన్నాడీఎంకే కార్పొరేటర్లు (ఇన్‌సెట్‌లో) మేయర్ ఇంద్రాణి

చెన్నై, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మదురై కార్పొరేషన్ మేయర్ ఇంద్రాణి రాజీనామాను శుక్రవారం ఉదయం జరిగిన కౌన్సిల్ అత్యవసర సమావేశంలో ఆమోదించారు. ఆ తర్వాత కొన సాగిన సమావేశంలో అన్నాడీఎంకే, డీఎంకే సభ్యుల మధ్య తీవ్రవాగ్వివాదం జరిగింది. మదురై కార్పొరేషన్‌లో వాణిజ్య సంస్థలకు ప్రభుత్వం నిర్దేశించిన పన్నులకు భిన్నంగా వసూలు చేసి మేయర్ ఇంద్రాణి భర్త పొన్ వసంత్ అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలు రావటంతో ఏసీబీ అధికారులు ఆయన్ని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. పన్నుల వసూళ్ల అవినీతిలో మేయర్ ఇంద్రాణికి కూడా భాగస్వామ్యం ఉందంటూ అన్నాడీఎంకే, బీజేపీ కార్పొరేటర్లు రెండు సార్లు కౌన్సిల్ సమావేశాల్లో ధర్నాకు దిగారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 12న అరెస్టయిన మేయర్ భర్త పొన్ వసంత్ రెండున్నర నెలల పాటు జైలులో ఉండి ఈ నెల తొమ్మిదిన బెయిలుపై విడుదలయ్యారు. ఈ పరిస్థితుల్లో మేయర్ ఇంద్రాణి గత బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. శుక్రవారం ఉదయం జరిగిన సమావేశంలో కౌన్సిల్ ఇంద్రాణి రాజీనామాను అన్నాడీఎంకే శాసనసభ్యుల నిరసన నినాదాల నడుమ ఆమోదించింది.

అన్నాడీఎంకే కార్పొరేటర్ల బైఠాయింపు..

మేయర్ రాజీనామా చేయడంతో కార్పొరేషన్ పరిధిలో ప్రజాపనులు స్తంభిస్తాయంటూ అన్నాడీఎంకే కార్పొరేటర్లు సమావేశ మందిరంలోనే ధర్నాకు దిగారు. తొలుత డిప్యూటీ మేయర్ డి. నాగరాజన్ అధ్యక్షతన అన్నా మాళిగై మీటింగ్ హాలులో కౌన్సిల్ సమావేశం జరిగింది. తొలుత మేయర్ ఇంద్రాణి రాజీనామాను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా అన్నాడీఎంకే సభ్యులు మాట్లాడుతూ ఇప్పటికే వివిధ స్టాండింగ్ కమిటీ చైర్మన్లు తమ పదవికి రాజీనామా చేశారని, ప్రస్తుతం మేయర్ కూడా పదవి నుండి వైదొలగటంతో అభివృద్ధి పనులు స్తంభిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా 45వ వార్డులో మురుగునీటి కాల్వ మరమ్మతు పనులు చేపడతానని డిప్యూటీ మేయర్ నాగరాజన్ హామీ ఇచ్చారు.



కౌన్సిల్‌హాలులో ధర్నా చేస్తున్న అన్నాడీఎంకే కార్పొరేటర్లు



ఎంజీఆర్, జయ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న అన్నాడీఎంకే నేతలు

ఘనంగా అన్నాడీఎంకే వ్యవస్థాపక దినోత్సవం

- పార్టీ పతాకాన్ని ఎగురవేసిన ఈపీఎస్

ప్యారీస్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే 54వ వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. స్థానిక రాయపేట లాయిడ్స్ రోడ్డులో వున్న ఆ పార్టీ ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాలిగైలో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎంజీఆర్, మాజీ ముఖ్యమంత్రి దివంగత జయలలిత కాంస్య విగ్రహాలకు గజమాలలు వేసి నివాళులర్పించి, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నేతలకు, కార్యకర్తలకు ఆయన మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా 'అన్నావలి ద్రావిడం' పేరుతో ముద్రించిన ప్రత్యేక సావనీర్‌ను ఈపీఎస్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్నాడీఎంకేను వల్లే రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి 30 యేళ్ళపాటు అన్నాడీఎంకే అధికారంలో ఉండటం రాష్ట్రానికి రక్షణ కవచంలా మారిందని ప్రజలు పదేపదే చెబుతున్నారని, రాష్ట్రాన్ని ఉన్నతస్థితిలో నిలిపి ఘనత పార్టీదేనన్నారు. ఈ వేడుకల్లో పార్టీ ప్రిసీడియం చైర్మెన్ తమిళమగన్ హుసేన్, మాజీమంత్రులు కేపీ మునిస్వామి, డి.జయకుమార్, దిండుగల్ శ్రీనివాసన్, ఎస్పీ వేలుమణి, తంగమణి, ఆర్బీ ఉదయ్‌కుమార్, గోకుల ఇందిరా, పి.బెంజిమెన్, సెమ్మలై, మాజీ డిప్యూటీ స్పీకర్ పొల్లాచ్చి జయరామన్, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ అనుబంధ సంస్థల నిర్వాహకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



కీలాంబాక్కం బస్ టెర్మినల్‌లో ప్రయాణికుల రద్దీ



చెన్నై-తిరుచ్చి జాతీయ రహదారిలో నిలిచిపోయిన వాహనాలు



సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

దీపావళికి సొంతూళ్లకు..

- కిక్కిరిసిన బస్సులు, రైళ్లు
- ఎస్ఈటీసీ బస్సుల్లో 2.75లక్షల మంది రిజర్వేషన్

ప్యారీస్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ కోసం 12 లక్షల మంది నగర వాసులు తమ సొంతూళ్లకు బయలుదేరి వెళ్లారు. రాజధాని నగరం నుంచి దక్షిణాది ప్రాంతాలకు బస్సులు, రైళ్లు ఇతర వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. ప్రజల సౌకర్యార్థం స్టేట్ ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎస్ఈటీసీ) ఆధ్వర్యంలో నగరం నుంచి యధావిధిగా నడుపుతున్న బస్సులతో పాటు రెండు రోజులుగా ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉన్నాయి. అదేవిధంగా రాష్ట్రంలోని జిల్లా కేంద్రాల నుంచి నడుపుతున్న ప్రత్యేక బస్సులతో పాటు మొత్తం20,378 ప్రత్యేక బస్సుల్లో ప్రజలు తమ స్థానాలకు చేరుకుంటున్నారు. నగరంలోని కీలాంబాక్కం, కోయంబేడు, మాధవరం టెర్మినళ్ల నుండి నడుపుతున్న ఎస్ఈటీసీ బస్సుల్లో వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ఎంటీసీ లింక్ బస్సులను నడుపుతోంది. నగరం నుంచి గురువారం యధావిధిగా నడుపుతున్న 2,092 బస్సులతో పాటు 761 ప్రత్యేక బస్సుల్లో 1,28,275 మంది తమ సొంతూళ్లకు వెళ్లారు. ఎస్ఈటీసీ బస్సుల్లో శుక్రవారం వరకు 2.75 లక్షల మంది టికెట్ రిజర్వేషన్ చేసుకున్నారు. చివరి నిమిషంలో రద్దీని నివారించే దిశగా ప్రభుత్వ రవాణా సంస్థలు రద్దీని బట్టి అదనపు బస్సులను కూడా నడుపుతున్నాయి. మరోవైపు కీలాంబాక్కం బస్ టెర్మినల్ ప్రాంగణంలో 12 రిజర్వేషన్ కౌంటర్లు గురువారం నుంచి పనిచేస్తున్నాయి. కాగా, సెలవు రోజులైన శని, ఆదివారాల్లో సుమారు 4లక్షలకు పైగా ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణించే అవకాశముంది. ఒకే సమయంలో ఇటు తాంబరం, అటు కోయంబేడు - పూందమల్లి రహదారి మీదుగా బస్సులు బయలుదేరటంతో నగరంలో వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఇదేవిధంగా కోయంబేడు నుండి పూందమల్లి దాకా రహదారులన్నీ బస్సులతో నిండిపోయాయి. పోలీసులు జోక్యం చేసుకుని ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. ఇదే విధంగా మరైమలర్ నుండి సింగపెరుమాళ్ వరకూ సుమారు ఆరు కి.మీ.ల పొడవునా వాహనాలు బారులు తీరాయి. కోయంబేడు బస్‌స్టేషన్ నుంచి బయలుదేరి రవాణా సంస్థ బస్సులు, ఆమ్నీ బస్సులు మధురవాయల్ నుండి పూందమల్లి వరకూ నెమ్మదిగానే నడిచాయి. ట్రాఫిక్ పోలీసులు పలు జంక్షన్‌ల వద్ద నిలిచి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. తాంబరం మార్గంలో శనివారం వేకువజామున మూడు గంటల వరకూ పలు చోట్ల ట్రాఫిక్ స్తంభించింది. కోయంబేడు బస్‌స్టేషన్‌లో శుక్రవారం ఉదయం నుండి సాయంత్రం వరకూ ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది.

కరూర్ దుర్ఘటనపై సీబీఐ విచారణ ప్రారంభం

చెన్నై, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కరూర్ వేలుచ్చామిపురం వద్ద సెప్టెంబర్ 27 రాత్రి 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) నేత విజయ్ నిర్వహించిన రోడ్‌షోలో 41 మంది మృతి చెందిన ఘటనపై సీబీఐ విచారణ ప్రారంభమైంది. సుప్రీంకోర్టు ఆ దుర్ఘటనపై సీబీఐ విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. గుజరాత్ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో ఏఎస్పీ ముఖేష్‌కుమార్, డీఎస్పీ రామకృష్ణన్ సహా ఆరుగురు సభ్యుల సీబీఐ బృందం గురువారం అర్ధరాత్రి కరూర్ చేరుకుంది. ఈ అధికారులు కరూరు జిల్లా కలెక్టరేట్ సమీపంలో ఉన్న ప్రజాపనుల శాఖ వసతి గృహంలో బసచేశారు. శుక్రవారం ఉదయం ఈ కేసు విచారణ జరిపిన ఐజీ అస్రా గార్గ్ బృందం, కరూర్ పోలీసులు కేసుకు సంబంధించిన ఫైళ్ళను సీబీఐ అధికారులకు అప్పగించారు. ఆ తర్వాత సీబీఐ అధికారులు దుర్ఘటన జరిగిన వేలుచ్చామిపురం వద్ద విచారణ ప్రారంభించారు. మృతుల కుటుంబీకులను పరామర్శించి, వారి నుంచి కొన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. దుర్ఘటన జరిగిన రోజు రోడ్‌షో ప్రాంతంలో సంచరించిన అంబులెన్స్‌ల డ్రైవర్లను, భద్రతాధికారులను విచారించారు. సిట్ అధికారిగా పనిచేసిన ఐటీ అస్రాగార్గ్‌ను కూడా సీబీఐ అధికారులు దర్యాప్తు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా శనివారం నుండి సీబీఐ అధికారుల ముమ్మర దర్యాప్తు ప్రారంభమవుతుందని కరూర్ పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

షష్టి పూర్తి కోసం వెళ్తూ మృత్యు ఒడిలోకి

- కారును లారీ ఢీకొన్న ప్రమాదంలో దంపతుల మృతి



ప్రమాదంలో ధ్వంసమైన కారు

చెన్నై, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తమ షష్టి పూర్తి వేడుకలు జరుపుకునేందుకు వెళ్తున్న దంపతులను మృత్యువు కబలించింది, తంజావూరు జిల్లా నరసింగంపేట వద్ద శుక్రవారం ఉదయం సంభవించిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా... కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చి కుమరన్ నగర్ ప్రాంతంలో సుబ్రమణి (60), కళావతి (56) దంపతులు నివసిస్తున్నారు. పారిశ్రామికవేత్త అయిన సుబ్రమణి దంపతులతో కుమారుడు రాకేష్ (35) కోడలు రాజేశ్వరి (27) కలిసి ఉంటున్నారు. సుబ్రమణికి అరవైయేళ్లు నిండటంతో షష్టిపూర్తి వేడుకలు జరపాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు. ఆ వేడుకల నిర్వహణ ముందస్తు ఏర్పాట్లను పరిశీలించేందుకుగాను వీరందరూ కారులో పొల్లాచ్చి నుంచి తిరుకడయూరు అమృతఘటేశ్వరాలయానికి బయలుదేరారు. తంజావూరు జిల్లా తిరువిడైమరుదూరు తాలూకా తిరునీలక్కుడి సమీపం నరసింగంపేట వద్ద వద్ద వెళ్తుండగా కొబ్బరి బొండాల లోడుతో వెళ్తున్న లారీ వీరి కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్రమణి, కళావతి తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. రాకేష్, రాజేశ్వరి, కారు నడిపిన ఆస్కార్ (25) తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని కారు శిథిలాల మధ్యనుంచి మృతదేహాలను, క్షతగాత్రులను వెలికి తీశారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం తంజావూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనకు సంబంధించి తెన్‌కాశికి చెందిన లారీ డ్రైవర్ మారిదురై, సేలంకు చెందిన మాదేష్ లను అరెస్టు చేశారు.

బెజవాడ దుర్గమ్మ సేవలో గవర్నర్ దంపతులు



గవర్నర్‌కు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందిస్తున్న ఆలయ నిర్వాహకులు

చెన్నై, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి దంపతులు శుక్రవారం విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయానికి వెళ్లిన గవర్నర్‌కు ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వీకే శీనా నాయక్, వేదపండితులు, ధర్మకర్తల మండలి సభ్యులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేదపండితుల ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ ఈవో, చైర్మన్ అందించారు. అనంతరం గవర్నర్ కుటుంబీకులు మహామండపంలో దాతల సమావేశంలో పాల్గొని, వారితో పాటు అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు.

సమాచార దృష్టి

స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ

ప్యారీస్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఉత్పత్తి రంగంలో ఆధునిక టెక్నాలజీ, డిజిటల్ ఉత్పత్తి విధానంలో మెళకువలపై ఉచిత శిక్షణా తరగతులను చెన్నై ఐటీఐలో నిర్వహించనున్నారు. మెకానికల్ ప్రొడక్షన్, మెటలర్ ఇంజనీరింగ్ విభాగాల్లో డిగ్రీ పొందినవారు ఈ శిక్షణలో చేరవచ్చు. దరఖాస్తును https://www. tnskill.tn. gov.in/ అనే వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

కలైంజర్ స్మారక అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

ప్యారీస్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): 'కలైంజర్ స్మారక కళావిద్వాంసుడు' అవార్డు కోసం నవంబర్ 14లోపు దరఖాస్తు సమర్పించవచ్చు. 2024-2025వ సంవత్సరానికి సంబంధించి తమిళ చిత్రరంగంలో రికార్డులు నెలకొల్పి పతకాలు సాధించిన వారు ఆ అవార్డుకు అర్హులు. ఎంపికైనవారికి రూ.10లక్షల నగదుతో ప్రశంసాపత్రం అందజేస్తారు.http://dipr. tn.gov.in/ అనే వెబ్‌సైట్‌నుండి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ప్రభుత్వ రవాణా సంస్థల్లో వృత్తి శిక్షణ

ప్యారీస్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థల్లో ఈ ఆర్థిక సంవత్సరంలో వృత్తి శిక్షణ తరగతులు వచ్చే వారం నుండి ప్రారంభం కానున్నాయి. శిక్షణ సమయంలో అభ్యర్థులకు నెలకు రూ.9వేలు ప్రోత్సాహక వేతనాన్ని అందజేస్తారు. ఐటీఐ, డిప్లమా, ఇంజనీరింగ్ పట్టభద్రులు శిక్షణకు అర్హులు. ప్రభుత్వ రవాణా సంస్థల నిర్వహణలోని డిపోల్లో ప్రతిఏటా వృత్తి శిక్షణ నిర్వహించడం గమనార్హం. 12నెలల శిక్షణ కాలంలో ఇంజనీరింగ్ విభాగానికి రూ.9వేలు, డిప్లమా విభాగానికి రూ.8వేలు చొప్పున ప్రతినెలా ప్రోత్సాహనిధి పంపిణీ చేస్తారు. మరిన్ని వివరాలకు https://nats. education.gov.in/ అనే వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తును పూర్తిచేసి శనివారం సాయంత్రం 5గంటలలోగా సమర్పించాల్సివుంటుంది.

నేడు తరమణిలో జాబ్‌మేళా

ప్యారీస్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక తరమణిలోని సీఐటీ ప్రాంగణంలో శనివారం రాష్ట్రప్రభుత్వ 'వెట్రి నిశ్చయం' పథకం కింద జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఆస్కర్డియా ఫౌండేషన్ సహకారంతో నిర్వహించనున్న ఈ జాబ్‌మేళాలో 2017 నుండి 2025వరకు ఇంజనీరింగ్, ఆర్ట్స్, ఐటీఐ, డిగ్రీ పూర్తిచేసిన నిరుద్యోగ యువత 8667511342 అనే మొబైల్ నెంబర్, http://asgardiafoudation.org.in/ అనే వెబ్‌సైట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోచ్చు.

20న ఆదివారం టైంటేబుల్ ప్రకారం సబర్బన్ రైళ్లు

ప్యారీస్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని ఆదివారం టైమ్‌టేబుల్ ప్రకారం సోమవారం కూడా సబర్బన్ రైళ్లను నడపనున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. సోమవారం సెలవు రోజు కావడంతో ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై సెంట్రల్-అరక్కోణం, చెన్నై సెంట్రల్-గుమ్మిడిపూండి-సూళ్లూరుపేట, చెన్నై బీచ్-చెంగల్పట్టు మధ్య ఆదివారం టైంటేబుల్ ప్రకారమే సబర్బన్ రైళ్లు అందుబాటులో ఉంటాయని దక్షిణ రైల్వే ప్రకటించింది.

సేవా కేంద్రాల్లో ఉపాధి అవకాశాలు

● చెన్నై జిల్లా కలెక్టర్

అడయార్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చెన్నై జిల్లాలోని 24 గంటల పాటు సేవలందించే సేవా కేంద్రాల్లో ఉపాధి అవకాశాలు ఉన్నట్టు జిల్లా కలెక్టర్ కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. శానిటోరియం, నొచ్చికుప్పం, ఎళిల్ నగర్, షోలింగనల్లూరు, కన్నగి నగర్, సెమ్మంజేరి ప్రాంతాల్లోని సేవా కేంద్రాల్లో ఖాళీ పోస్టులను కాంట్రాక్టు విధానంలో భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు ఎంపికయ్యే వారు వారంలో 24 గంటల పాటు రొటేషన్ విధానంలో పనిచేయాల్సి ఉంటుంది. ఈ పోస్టులకు "https://chennai.nic.in/" అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు "జిల్లా సాంఘిక సంక్షేమ కార్యాలయం, 8వ అంతస్తు, సింగారవేలర్ భవనం, జిల్లా కలెక్టరేట్ కార్యాలయం, రాజాజీ సాలై, చెన్నై-01" అనే చిరునామాకు చేరవేయాల్సి ఉంటుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అపోలో ఆస్పత్రిలో రాజాత్తి అమ్మాళ్‌కు చికిత్స

అడయార్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా అపోలో ఆస్పత్రిలో చేరిన దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి సతీమణి, ఎంపి కనిమొళి మాతృమూర్తి రాజాత్తి అమ్మాళ్‌కు చికిత్స కొనసాగుతోంది. స్థానిక సీఐటీ కాలనీలో తన కుమార్తెతో కలిసి ఉంటున్న ఆమె. వయోభాగం కారణంగా మూడు రోజుల క్రితం అస్వస్థతకు లోనై ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే.

వార్డుల్లో కనీస వసతులు కల్పించండి

● కలెక్టర్‌కు ప్రజల విజ్ఞప్తి

తిరుత్తణి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని 15వార్డుల్లో కనీస వసతులు లేవని ప్రజలు వాపోతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో మొత్తం 15 వార్డులున్నాయని, అందులో ముఖ్యంగా బన్నారియమ్మన్‌వీధిలోని కాలువల్లో మురుగునీరు నిలిచి దుర్గంధం వస్తోందని, వీధి లైట్లు కూడా వెలగడంలేదని, తాగునీరు కూడా సకాలంలో రావడంలేదని తెలిపారు. దీనిపై పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేదన్నారు. అదే విధంగా వీధిలో ప్రభుత్వం రూ.29లక్షలతో నిర్మించిన పార్కులో కూడా పనులు పూర్తిచేయకుండా అధికారులు అవినీతికి పాల్పడుతున్నారన్నారు. దీనిపై శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రతాప్ దృష్టికి తీసుకెళ్లామని, ఆయన త్వరలోనే దీనిపై చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని బన్నారియమ్మన్ వీధి ప్రజలు తెలిపారు.

'ఈశాన్యం'పై 22న సీఎం సమీక్ష

అడయార్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దేశంలోని పలు రాష్ట్రాల్లో ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించడంతో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో ఈశాన్య రుతుపవనాల కారణంగా రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం ముందుజాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ క్రమంలో ఈ నెల 22న ముఖ్యమంత్రి స్టాలిన్ ఈశాన్య సీజన్‌లో తీసుకోవాల్సిన, చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లపై సంబంధిత శాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ముఖ్యంగా గతంలో వరద ముప్పునకు గురైన ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. గతంలో ఏర్పడిన వరద నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈ సీజన్‌లో అలాంటి నష్టం జరుగకుండా అధికార యంత్రాంగం తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచనలు సీఎం ఇవ్వనున్నారు.

నాలుగు గుంకీల సాయంతో ఎట్టకేలకు 'రోలెక్స్' నిర్బంధం

● అధికారులకు జేజేలు పలికిన జనం




మత్తుమందు ప్రయోగంతో నిలిచిన 'రోలెక్స్' అడవి ఏనుగును తాళ్లతో బంధిస్తున్న సిబ్బంది - ఏనుగును లారీలో ఎక్కిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

చెన్నై, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా పడమటి కనుమల సమీపంలోని తొండాముత్తూరు, నరసీపురం, కెంపనూరు, మరుదమలై, తటాకం తదితర ప్రాంతాల ప్రజలను ముప్పుతిప్పలు పెట్టి నెలల తరబడి కంటికి కునుకులేకుండా ఇబ్బందులకు గురిచేసిన 'రోలెక్స్' అడవి ఏనుగును నాలుగు గుంకీల సాయంతో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది ఎట్టకేలకు బంధించారు. శుక్రవారం ఉదయం ఆ అడవి ఏనుగును లారీలో ఎక్కించి తరలిస్తుండగా గ్రామస్థులు అటవీ శాఖ అధికారులకు జేజేలు పలికారు. రోలెక్స్ ఏనుగు బాహుబలి మాదిరిగా పెద్దదిగా ఉండటంతో ఆ ఏనుగును చూసి స్థానికులు భయపడేవారు. రెండు నెలలుగా ఆ ఏనుగు గ్రామాలో సంచరిస్తూ ఇళ్లను ధ్వంసం చేస్తూ, తోటల్లోకి ప్రవేశించి పంటలను నాశనం చేస్తూ అల్లకల్లోలం సృష్టించింది. ఆ ఏనుగుదాడిలో సుమారు పదిమంది గాయపడ్డారు. ఇలా తమను రోజూ ఇబ్బందులకు గురిచేస్తున్న ఆ అడవి ఏనుగుకు గ్రామస్థులంతా 'రోలెక్స్ ఏనుగు' అనే పేరుపెట్టారు. ఆ రోలెక్స్ ఏనుగును నిర్బంధించి తమను కాపాడాలంటూ అటవీశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. గత నెల టాప్‌స్లిప్ నుండి నరసింహన్, ముత్తు అనే రెండు గుంకీ ఏనుగులను రప్పించి రోలెక్స్‌ను బంధించేందుకు ఉపక్రమించారు. వెటర్నరీ డాక్టర్ విజయరాఘవన్ నాయకత్వంలో సిబ్బంది ఆ ఏనుగుకు మత్తుమందు ఇచ్చేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో రోలెక్స్ ఏనుగు డాక్టర్ విజయరాఘవన్‌పై దాడిచేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఆ ఏనుగును బంధించే పనులు ఆగిపోయాయి. దీనికితోడు తెప్పించిన రెండు గుంకీ ఏనుగులకు మదమెక్కడంతో వాటిని టాప్‌స్లిప్ ఏనుగుల శిబిరానికి పంపారు. ఈ నేపథ్యంలో టాప్‌స్లిప్ ప్రాంతం నుండి చిన్నతంబి, కపిల్‌దేవ్ అనే రెండు గుంకీ ఏనుగులను, నీలగిరి జిల్లా ముదుమలై నుండి వశీం, కొంబన్ అనే మరో రెండు గుంకీ ఏనుగులను రప్పించి 'రోలెక్స్' ఏనుగు ఆచూకీ కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. చివరకు ఆ ఏనుగు తొండాముత్తూరు వద్ద సంచరిస్తుండగా గమనించి, అటవీ శాఖ ఉన్నతాధికారి వెంకటేశన్ పర్యవేక్షణలో వెటర్నరీ డాక్టర్లు కలైవానన్, రాజేష్, వెన్నిలా తదితర సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకున్నారు. శుక్రవారం వేకువజాము నాలుగు గంటలకు 'రోలెక్స్' ఏనుగుకు వెటర్నరీ డాక్టర్లు మత్తు ఇంజెక్షన్లు వేయడంతో అది అక్కడే నిలిచిపోయింది. గుంకీ ఏనుగులు కపిల్‌దేవ్, వసీం, కొంబన్ సాయంతో దానిని తాళ్లతో బంధించారు. ఈ విషయం తెలియగానే చుట్టుపక్కల గ్రామస్థులంతా పెద్ద సంఖ్యలో గుమికూడారు. శుక్రవారం ఉదయం లారీలోకి 'రోలెక్స్' ఏనుగును ఎక్కించి తరలించారు. ఆ ఏనుగును లారీలో ఎక్కించి తీసుకెళుతుండగా గ్రామస్థులంతా అటవీశాఖ అధికారులు, వెటర్నరీ డాక్టర్లకు జేజేలు పలుకుతూ పరుగులు తీశారు. పట్టుబడిన 'రోలెక్స్' ఏనుగును ముదుమలై ఏనుగల శిబిరానికి తరలించనున్నట్లు అధికారులు తెలిపారు.

టీవీకే గుర్తింపు పొందిన పార్టీ కాదు

● హైకోర్టు తెలిపిన ఈసీ

ప్యారీస్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) గుర్తింపు పొందిన పార్టీ కాదని కేంద్ర ఎన్నికల కమిషన్ మద్రాస్ హైకోర్టుకు తెలిపింది. మదురైకు చెందిన సెల్వకుమార్ అనే న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌లో, రాజకీయ పార్టీలు నిర్వహించే సభలకు మహిళలు, చిన్న పిల్లలను అనుమతించరాదని ప్రజా ప్రతినిధుల చట్టంలో ఉందని, అయితే కరూర్‌లో టీవీకే అధ్యక్షుడు గత నెల 27న పాల్గొన్న రోడ్‌షోలో ఎన్నికల నిబంధనలను అతిక్రమించి పెద్దసంఖ్యలో ప్రజలను సమీకరించారని, భవిష్యత్తులో ఇలా జరగకుండా న్యాయస్థానం ఆదేశించాలని కోరారు. చట్టాన్ని ఉల్లంఘించే రాజకీయ పార్టీల గుర్తింపులను రద్దుచేసేందుకు ఎన్నికల కమిషన్‌కు అధికారం ఉన్నదని సుప్రీంకోర్టు పలు కేసుల్లో ఉత్తర్వులు జారీచేసినట్లు సెల్వకుమార్ తన పిటిషన్‌లో సూచించారు. విజయ్, టీవీకే నిర్వాహకుల నిర్లక్ష్యం, ముందస్తు ఏర్పాట్లు చేపట్టని కారణంగానే 41 మంది మృతిచెందారన్నారు. ఈ ఘటనకు సంబంధించిన కేసులో విజయ్ పేరు చేర్చలేదని, అరెస్టయిన టీవీకే నాయకులు సులువుగా తప్పించుకునేలా ఆర్డినరీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పిటిషన్‌లో తెలిపారు. ఈ కేసు విచారణ పూర్తయ్యేవరకు ఏ రాజకీయ పార్టీకి రోడ్‌షో, బహిరంగ సభలకు అనుమతించకుండా డీజీపీకి ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్ శుక్రవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.ఎం. శ్రీవాత్సవ, జస్టిస్ జి.అరుళ్ మురుగన్‌లతో కూడిన ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. టీవీకే గుర్తింపులేని పార్టీ కావడం వల్ల ఆ పార్టీ గుర్తింపు రద్దు చేయాలని కోరలేమని ఎన్నికల కమిషన్ తరుపున హాజరైన న్యాయవాది తెలిపారు. ఇరు తరుపు న్యాయవాదుల వాదనలు విన్న అనంతరం ఈ పిటిషన్‌కు వివరణ ఇవ్వాల్సిందిగా రాష్ట్రప్రభుత్వానికి, డీజీపీకి హైకోర్టు ప్రధమ ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది.

ఎంజీఆర్ విగ్రహం వద్ద ఈపీఎస్, ఓపీఎస్ వర్గీయుల ఘర్షణ



ఓపీఎస్ వర్గీయులను దూషిస్తూ కారెక్కి వెళుతున్న ఈపీఎస్ వర్గీయులు

చెన్నై, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ఆవిర్భావ వేడుకల సందర్భంగా నాగర్‌కోవిల్ వడచేరి వద్ద ఎంజీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసే సందర్భంగా పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) వర్గీయులు, మాజీ సీఎం పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) వర్గీయులు ఘర్షణ పడ్డారు. ఆ విగ్రహం వద్దనున్న ఈపీఎస్ ఫోటోను గుడ్డతో మూసివేయడంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం జరిగింది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను శాంతింప జేశారు. ఆ ప్రాంతం నుండి తిరిగి వెళుతూ ఇరువర్గాలకు చెందిన స్థానిక నాయకులు దూర్భాషలాడుకున్నారు.

ఫారెస్ట్ అధికారుల ఆధ్వర్యంలో పేలుడు పదార్థాల నిర్వీర్యం



పేలుడు పదార్థాల నిర్వీర్యం చేస్తున్న అటవీశాఖ అధికారుల బృందం

వేలూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియాత్తం సమీపంలోని సెంగుద్రం అడవి ప్రాంతంలో గత నెల 30న జంతువులను వేటాడేందుకు అమర్చిన 15 దేశవాళీ పేలుడు పదార్థాలను గుర్తించిన అటవీశాఖ సిబ్బంది వాటిని స్వాధీనం చేసుకుని సంతోష్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసారు. స్వాధీనం చేసుకున్న 15 పేలుడు పదార్థాలను గుడియాత్తం అటవీ శాఖ కార్యాలయంలో భద్రపరిచారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం ఉదయం ఫారెస్ట్ అధికారులు, పోలీసుల ఆధ్వర్యంలో చెన్నైకు చెందిన బాంబ్ స్క్వాడ్, గుడియాత్తంకు చెందిన అగ్నిమాపక శాఖ అధికారులు సమక్షంలో అడవిలో పదడుగుల గుంతను తీసి అందులో ఈ 15 పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేశారు.

ఘనంగా అన్నాడీఎంకే ఆవిర్భావ దినోత్సవం



ఎంజీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అన్నాడీఎంకే నేతలు

తిరుత్తణి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని మాజీ ఎంపీ జి.హరి ఆధ్వర్యంలో శుక్రవారం తిరుత్తణిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమిళనాడులో ఎక్కువ కాలం అధికారంలో ఉన్న పార్టీ అన్నాడీఎంకేనే అని, అన్నాడీఎంకే అధికారంలో ఉన్నప్పుడు అమలు పరిచిన పథకాలనే నేటికి పేర్లు మార్చిందని విమర్శించారు. అనంతరం తిరుత్తణి మార్కెట్ వీధిలోని ఎంజీఆర్ విగ్రహానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించి, కార్యకర్తలకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో అన్నాడీఎంకే కార్యనిర్వాహకులు జయశేఖరబాబు, కేబుల్ సురేష్, వెలంచేరి పళని తదితరులు పాల్గొన్నారు.

సాంతంగాడులో 136 దుకాణాల వేలం

ప్యారీస్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువొత్తియూర్ సాతంగాడు ప్రాంతంలో ఇనుము వ్యాపారులకు 136 దుకాణాలను వేలం వేయనున్నట్లు చెన్నై మెట్రోపాలిటన్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ (సీఎండీఏ) ప్రకటించింది. నగరంలో వాహనాల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా శివారు ప్రాంతమైన సాంతంగాడులో 203 ఎకరాల విస్తీర్ణంలో హోల్‌సేల్ ఇనుము విక్రయ వాణిజ్య కేంద్రం ఏర్పాటైంది. మొత్తం 850 దుకాణాలు వ్యాపారులకు కేటాయించిన నేపథ్యంలో మిగతా 136 దుకాణాలను వేలంపాట ద్వారా విక్రయించనున్నారు. ఇందుకు నవంబర్ 25లోపు సీఎండీఏ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

బైపాస్ రోడ్లలో బస్టాండ్ల ఏర్పాటు

ప్యారీస్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం బైపాస్ రోడ్లలో కొత్త బస్టాండ్లు ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌శాఖ మంత్రి కేఎన్.నెహ్రూ తెలిపారు. కోవై, దిండుగల్, మదురై, తిరుచ్చి, చెన్నై తదితర అన్ని జిల్లాల్లో పర్మినెంట్ బస్టాండ్లున్నాయని, ప్రధాన రహదారుల్లో మాత్రమే దూరప్రాంతాల బస్సులు ఆగి వెళుతున్నాయని, బైపాస్ రోడ్లలో బస్టాండ్లు ఏర్పాటు చేయాలని ప్రజల నుంచి స్వీకరించిన వినతిపత్రాలను పరిశీలించి ఆ రోడ్లలో కొత్త బస్టాండ్ల వసతి కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు.



తమ కోర్కెల సాధన కోసం శుక్రవారం సచివాలయం వద్ద ధర్నాకు దిగిన పారిశుధ్య కార్మికులను తొలగిస్తున్న పోలీసులు

జీడీ నాయుడు ఫ్లైఓవర్‌పై అతివేగంగా వెళ్తే చర్యలు

● హెచ్చరించిన కోవై పోలీస్ కమిషనర్



జీడీనాయుడు ఫ్లైఓవర్

ప్యారీస్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కోవై అవినాశి రోడ్డులో ఇటీవలే ప్రారంభించిన జీడీ నాయుడు ఫ్లైఓవర్‌పై 30కిలోమీటర్లకు మించి వేగంగా వళ్లే వారిపై చర్యలుంటాయని కోవై పోలీసు కమిషనర్ ఎ.శరవణ సుందర్ పేర్కొన్నారు. జీడీనాయుడు ఫ్లైఓవర్ ప్రారంభమవుతున్న ఉప్పిలిపాళయం రౌండ్ టానా నుంచి వాహనాల ట్రాఫిక్ రద్దీ పెరగడంతో వంతెన నుంచి కిందకి దిగేందుకు ఎటు వెళ్లాలో తెలియక వాహనచోదకులు తంటాలు పడుతున్నారు. మరోవైపు వంతెనపై నుండి వెళ్లేందుకు పలు ప్రాంతాల నుంచి ఒక్కసారిగా పెద్దసంఖ్యలో వాహనాలు వస్తుండటమే రద్దీకి కారణమని ట్రాఫిక్ పోలీసుల అంచనా. ఈ నేపథ్యంలో, రెండ్రోజుల క్రితం ఈ వంతెన మీదుగా అతివేగంగా వాహనం నడిపి ప్రమాదంలో చిక్కుకుని ముగ్గురు మృతిచెందిన సంఘటన స్థానికులను ఆందోళనకు గురిచేసింది. దీనిపై దృష్టిసారించిన పోలీస్ కమిషనర్ ఈ వంతెన మీదుగా 30 కిలోమీటర్ల వేగం కంటే అతివేగంగా వాహనాలు నడపరాదని బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. నిబంధనలు అతిక్రమించే వాహనాలకు ఆన్‌లైన్ ద్వారా జరిమానా విధించనున్నట్లు ఆయన హెచ్చరించారు.

ముగిసిన అసెంబ్లీ

●చివరి రోజు 16 ముసాయిదా బిల్లులకు ఆమోదం



చెన్నై, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ శీతాకాలపు సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు సభలో 16 రకాల ముసాయిదా బిల్లులను ప్రవేశపెట్టి మూజువాణి ఓటుతో ఆమోదింపజేశారు. గత మంగళవారం ప్రారంభమైన ఈ సమావేశాలు తొలిరోజున మాజీ శాసనసభ్యులు, నాగాలాండ్ మాజీ గవర్నర్ ఇల గణేశన్ తదితర ప్రముఖుల సంతాప తీర్మానాలతో ముగిసింది. బుధవారం నుండి శుక్రవారం దాకా జరిగిన ఈ సమావేశాల్లో ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే కరూర్ దుర్ఘటన, మధ్యప్రదేశ్‌లో దగ్గుమందు కారణంగా చిన్నారుల మృతి, కిడ్నీల చోరీల వ్యవహారాన్ని పాలకుల దృష్టికి తీసుకువచ్చింది. టీవీకే నేత విజయ్ రోడ్‌షోలో రద్దీ ఏర్పడుతుందని తెలిసి కూడా డీఎంకే ప్రభుత్వం చాలినంత భద్రత కల్పించకపోవడంతో 41 మంది మృతి చెందినట్లు అన్నాడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామి ఆరోపించారు. దీనిని ఖండించిన ముఖ్యమంత్రి స్టాలిన్ కరూర్ రోడ్ షోకు టీవీకే నేత ఆరుగంటల ఆలస్యంగా రావటం వల్లే తొక్కిసలాట జరిగిందన్నారు. కరూర్ దుర్ఘటనపై చర్చ జరుగుతుండగానే మంత్రి శివశంకర్ మాట్లాడుతూ అన్నాడీఎంకే హయాంలో జరిగిన తూత్తుకుడి కాల్పులకు సంబంధించి కొన్ని వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలను సభ రికార్డుల నుండి తొలగించాలని పట్టుబడుతూ స్పీకర్ పోడియం వద్ద అన్నాడీఎంకే సభ్యులంతా ధర్నాకు దిగారు. ఆ తర్వాత సభ నుండి వాకౌట్ చేశారు. చివరి మూడు రోజులలో అన్నాడీఎంకే సభ్యులు వింత బ్యాడ్జీలు ధరించారు. ఇక పాలకపక్షం ఆరోపణలకు తగిన విధంగానే సమాధానాలిచ్చినా, వాటిని వినకుండా ప్రతిపక్షమైన అన్నాడీఎంకే సభ్యులు వాకౌట్లు చేస్తూ వచ్చారు. ఈ సమావేశాల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్‌కు సీఎం స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు తెలపటం, సీనియర్ మంత్రి దురై మురుగన్ ఆరోగ్యం గురించి అన్నాడీఎంకే నేత ఈపీఎస్ వాకబు చేయడం విశేషం.

పీఎంకే తీరు... : ఈ సమావేశాల్లో పీఎంకేకు చెందిన ఐదుగురు శాసనసభ్యులు రెండు వర్గాలుగా విడిపోయి వ్యవహరించడం చర్చనీయాంశమైంది. పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి వర్గానికి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు పార్టీ సభాపక్ష నాయకుడిగా ఉన్న జీకే మణిని తొలగించాలని స్పీకర్‌పై ఒత్తిడి చేశారు. శుక్రవారం శాసనసభలో గ్రామీణాభివృద్ధి చట్ట సవరణ బిల్లు, రహదారుల శాఖ చట్ట సవరణ బిల్లు, విద్యుత్ వినియోగదారుల చట్ట సవరణ బిల్లు సహా మొత్తం 16 రకాల చట్ట సవరణ బిల్లులను ఆయా శాఖలకు చెందిన మంత్రులు ప్రవేశపెట్టారు. స్పీకర్ అప్పావు ఆ బిల్లులను మూజువాణి ఓటింగ్ ద్వారా ఆమోదింపజేశారు. ఆ తర్వాత సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

ధాన్యం తడిసిపోవడానికి కేంద్రమే కారణం

పాలిష్డ్ బియ్యానికి అనుమతివ్వాలి ● మంత్రి చక్రపాణి

అడయార్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): డెల్టా జిల్లాల్లో రైతులు పండించిన ధాన్యం వర్షానికి తడిసిపోవడానికి కేంద్రమే కారణమని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి చక్రపాణి ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శుక్రవారం జీరో అవర్‌లో ఆయన ధాన్య సేకరణపై విపక్ష సభ్యులు సంధించిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచే ధాన్యం సేకరణకు అనుమతివ్వాలని కేంద్రానికి ముఖ్యమంత్రి లేఖ రాయగా, ఎలాంటి స్పందన రాకపోవడంతో అక్టోబరు 1 నుంచి ధాన్య సేకరణ ప్రారంభించినట్టు చెప్పారు. ఈ యేడాది ఆరున్నర లక్షల ఎకరాల్లో వరి సాగు చేయడంతో ధాన్యం దిగుబడి భారీగా వచ్చిందన్నారు. దీంతో సాధారణం కంటే అధిక మొత్తంలో ధాన్యం సేకరణ జరుగుతుందన్నారు. దీనిపై ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రత్యేకంగా సమాశాలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయిలో ధాన్య సేకరణ కేంద్రాలకు వెళ్ళి పరిశీలించాలని తనను ఆదేశించారని చెప్పారు. ప్రస్తుతం పది వ్యాగన్ల వరకు ధాన్య సేకరణ చేపట్టామన్నారు. అలాగే, ప్రతి రోజూ 35 వేల బస్తాల ధాన్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరిస్తున్నామన్నారు. ఆది వారాల్లో కూడా ధాన్య సేకరణ చేస్తున్నామన్నారు. రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అందువల్ల వరి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పాలిష్డ్ బియ్యానికి కేంద్రం అనుమతిస్తే రైతులు పండించిన ధాన్యాన్ని బియ్యంగా మారుస్తామని మంత్రి చక్రపాణి తెలిపారు.

● దీపావళి రద్దీ ఎఫెక్ట్ ..

విమాన చార్జీలకు రెక్కలు ఏకంగా 5 రెట్లు పెరుగుదల

అడయార్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విమాన చార్జీలు భారీగా పెరిగాయి. దీపావళి రద్దీని క్యాష్ చేసుకునేందుక విమానయాన సంస్థలు ఇష్టారాజ్యంగా ఏకంగా 5 రెట్లకుపైగా పెంచాయి. దీంతో ప్రయాణికులు లబోదిబోమంటున్నారు. ఈ నెల 20న దీపావళి పండుగ కోసం అనేకమంది పట్టణ వాసులు తమ సొంతూర్లకు వెళ్తున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు బస్సులతో పాటు రైళ్ళల్లో రిజర్వేషన్ టిక్కెట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. అదేసమయంలో విమాన టిక్కెట్లు కూడా అందుబాటులో లేకుండా పోయాయి. అయితే, ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండటంతో విమానసంస్థలు చార్జీలను ఒక్కసారిగా పెంచేశాయి. చెన్నై నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్ళే అన్ని విమాన సర్వీసుల్లో చార్జీల పెరుగుదల కనిపిస్తోంది. సాధారణ రోజుల్లో చెన్నై - మదురై ప్రాంతాల మధ్య రూ.3,129 ఉన్న టిక్కెట్ ధర రూ.17,683కు పెరిగింది. అలాగే, చెన్నై - కొచ్చి మధ్య రూ.3,608 ఉన్న చార్జీ రూ.15,233కు చేరింది. అలాగే, చెన్నై - కోవై మధ్య ప్రస్తుతం చార్జీ రూ.17,158 (సాధరణ రోజుల్లో రూ.4,361),చెన్నై-తూత్తుక్కుడి మధ్య రూ. 17,053 (రూ.3,608) పెరిగింది. అలాగే, చెన్నై - ఢిల్లీ మధ్య సాధారణ రోజుల్లో రూ.5,933ఉన్నచార్జీ,ఇపుడు రూ.30,414కు చేరుకుంది. అలాగే, చెన్నై - ముంబై మధ్య రూ.21960 (సాధారణ రోజుల్లో రూ.3356, చెన్నై - కోల్‌కత మధ్య రూ.22169 (రూ.5293), చెన్నై - హైదరాబాద్ రూ.15309 (రూ.2926), చెన్నై - గౌహతి మధ్య రూ.21639 (రూ.2499), చెన్నై - భువనేశ్వర్ రూ.14428 (రూ.4522), చెన్నై - జైపూర్ రూ.21591 (రూ.6151), చెన్నై - పాట్నా మధ్య రూ.15584 (రూ.4972) చొప్పున ప్రయాణ చార్జీలు పెరిగాయి.

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం

● ముగ్గురు పోలీసులపై కేసు నమోదు

ప్యారీస్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాణిపేట జిల్లా అరక్కోణం సమీపం తక్కోళంలో ఉన్న సీఐఎస్‌ఎఫ్ శిక్షణ కేంద్రంలో నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగంలో చేరిన ముగ్గురు పోలీసులపై కేసు నమోదైంది. అసోం రాష్ట్రానికి చెందిన శ్రావణ్‌కుమార్, ధన్‌వీర్, సింధుయాదవ్ అనే మహిళ పోలీసు ఉద్యోగాలకు ఎంపికై గత జనవరిలో తక్కోళంలోని సీఐఎస్‌ఎఫ్ సెంటర్‌లో శిక్షణలో చేరారు. వీరు సమర్పించిన సర్టిఫికెట్లను పరిశీలించగా అవి నకిలీవని తేలింది. దీనితో ఈ ముగ్గురిపై సీఐఎస్‌ఎఫ్ అధికారి రాకేష్ అందజేసిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

మహిళలపై లైంగిక వేధింపులు

● ముద్దాయికి మూడేళ్ళ జైలు

అడయార్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రోజు కూలీ చేసుకునే 50 మంది మహిళలను లైంగికంగా వేధించిన కేసులో ఓ వ్యక్తికి ఎగ్మోర్ కోర్టు మూడేళ్ళ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. కోయంబేడు ప్రాంతానికి చెందిన ఓ కూలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు... సాజీవ్ (32) అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతడు మాయమాటలతో దాదాపు 50 మంది మహిళలను లైంగికంగా వేధించినట్టు అంగీకరించాడు. ఈ కేసు విచారణ ఎగ్మోర్ కోర్టులో జరగగా, కేసులోని సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు సాజీవ్‌ను ముద్దాయిగా తేల్చి మూడేళ్ళ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

సౌకర్యాలన్నీ కల్పిస్తాం

●అంబత్తూరు పారిశ్రామికవేత్తలతో కలెక్టర్, ఎమ్మెల్యే

●కోసలనగరంలో పరిశ్రమల ఏర్పాటుపై సమీక్ష



కోసలనగరంలో పారిశ్రామిక వాడపై సమీక్షిస్తున్న కలెక్టర్ సుమీత్‌కుమార్, ఎమ్మెల్యే భాను

విజయపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా విజయపురం మండలాన్ని పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చేస్తామని కలెక్టరు సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కోసలనగరంలో పరిశ్రమల ఏర్పాటుపై అంబత్తూరు ఇండస్ట్రియల్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోసలనగరం పారిశ్రామిక వాడ ఏర్పాటుకు ఎ- బ్లాక్‌లో 1500 ఎకరాలు గుర్తించామన్నారు. పారిశ్రామిక వాడకు అవసరమైన నీరు, రోడ్డు, కరెంటు వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. తెలుగుగంగ ప్రాజెక్టు ద్వారా నీరు నిరంతరాయంగా సరఫరా చేస్తామన్నారు. పరిశ్రమలకు అవసరమైన భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి స్టాంప్ డ్యూటీ ప్రభుత్వమే భరిస్తుందని వివరించారు. అంబత్తూరు ఇండస్ట్రియల్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రతినిధి, సప్తగిరి హైమా ఇండస్ట్రియల్ పార్కు అధ్యక్షుడు హరిప్రసాద్, ఉపాధ్యక్షుడు ఆర్వేల రమేష్ నాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే భానుప్రకాష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో తామంతా పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చామన్నారు. ఎకరా భూమి ధర రూ.20 లక్షల లోపు ఇస్తామని కలెక్టరు హామీ ఇవ్వడంతో రెండు నెలల్లో ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు.ఆర్డీవో అనుపమ, అర్‌అండ్‌బీ డీఈ సుజాత, తహసీల్దార్ కిరణ్, ఏపీఐఐసీ అధికారులు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కా ధనంజయ యాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు బాబుయాదవ్, నాయకులు బాలసుబ్రమణ్యం రాజు, లోకేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



● 'సర్వేంద్రియానాం నయనం ప్రధానం'..

డాక్టర్ ఎస్.అరవింద్



వెలుగులు విరజిమ్మే పండుగ దీపావళి. భారతీయ సంస్కృతి, వారసత్వానికి ప్రతీక. దీపావళి అంటేనే అంబరాన్నంటే సంబరం... ఆబాలగోపాలం అంతా కలిసి టపాసులు పేలుస్తూ, బాణసంచా కాలుస్తూ ఉరకలెత్తే ఉత్సాహంతో దీపాల లక్ష్మికి స్వాగతం పలుకుతారు. ఇది ఎంతో ఆనందహేల అయినప్పటికీ కొన్ని సమయాల్లో ప్రమాదాలకు దారితీస్తుంది. టపాకాయలు, చిచ్చుబుడ్లు, మతాబులు కాల్చే సందర్భంలో ఒక్కోసారి అవి అనుకోకుండా పేలి కాల్చేవారికే కాకుండా సమీపంలోని ఉన్న వారికి కూడా హాని కలగజేస్తుంటాయి. ముఖ్యంగా కళ్ళకు ముప్పుతెస్తుంటాయి. ప్రమాద స్థాయి తీవ్రమైనప్పుడు శాశ్వతంగా చూపు కూడా కోల్పోవడం తటస్థిస్తుంటుంది. అలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల, అనుకోని సందర్భాల్లో అకస్మాత్తుగా కళ్ళకు గాయాలు అయినప్పుడు చేయాల్సిన సత్వర చర్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి. దీపావళి సందర్భంగా చెన్నై నగరంలోని ప్రముఖ నేత్ర వైద్య శాల 'అరవింద్ ఐ హాస్పిటల్' చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా.ఎస్ అరవింద్‌తో 'ఆంధ్రజ్యోతి' జరిపిన ముఖాముఖి ...

- వేళచ్చేరి, ఆంధ్రజ్యోతి

అవాంఛనీయ ఘటనలకు దూరంగా
అప్రమత్తంగా ఉండండి

● బాణసంచా ప్రమాదాలకు సొంత వైద్యం వద్దు
● వెంటనే వైద్యుడిని సంప్రదించండి
● 'అరవింద్ ఐ హాస్పిటల్' చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరవింద్

? మీ పేరు, హాస్పిటల్ పేరు కూడా ఒకటే. అంటే దీని వ్యవస్థాపకులు మీరేనా

! పేరు ఒకటే, కానీ వ్యవస్థాపకులు వేరే ఉన్నారు. మా మేనమామ డాక్టర్ అరవిందప్ప వెంకటస్వామి. మదురైలో 1976వ సంవత్సరంలో అరవింద్ కంటి హాస్పిటల్ స్థాపించారు. ఆయన అంకురార్పణ చేసిన ఈ ఆస్పత్రి నేడు ఎన్నో శాఖలతో మహావృక్షంలా ఎందరికో కంటి వెలుగులను ప్రసాదిస్తున్నది. డాక్టర్ వెంకటస్వామి, తమ ఆధ్యాత్మిక గురువైన అరబిందోఘోష్ బోధనలకు ప్రభావితులై, సేవామార్గాన్ని అనుసరించారు. అందుకే హాస్పిటల్‌ని శ్రీ అరబిందో పేరుతో స్థాపించారు. నాకు 'అరవింద్' అని నామకరణం చేసింది కూడా మామ అయిన డాక్టర్ వెంకటస్వామి. మా కుటుంబంలో ఎంతోమంది వైద్యులున్నారు. వారంతా నాకు ప్రేరణే. అయితే నేత్రవైద్యుడిగా కావడానికి ముఖ్యమైన ప్రేరణ కలిగించినవారు డా.వెంకటస్వామి.

? చెన్నైలోని అరవింద్ కంటి సంరక్షణ కేంద్రంలో కంటికి సంబంధించిన ఏయే సేవలందిస్తారు

! తమిళనాడులోని 15 అరవింద్ ఐ హాస్పిటల్స్‌లో చెన్నై పూందమల్లి రోడ్డు హాస్పిటల్ కూడా ఒక ప్రముఖ శాఖ. ఇక్కడ కంటికి సంబంధించిన అన్ని చికిత్సలు జరుగుతాయి. కంటి పరీక్షలు మొదలుకొని శుక్లాల ఆపరేషన్లు, గ్లూకోమా, రెటీనా తదితర ఎన్నో కంటి సమస్యలకు అరవింద్ కంటి సంరక్షణ కేంద్రం పరిష్కారంగా నిలుస్తున్నది. ఇక్కడ అంకితభావంతో పనిచేస్తున్న డాక్టర్లు, ఉన్నత ప్రమాణాలతో వైద్యసేవలు కూడా ప్రముఖపాత్ర పోషిస్తున్నాయి. ఉచిత సేవలు, నామినల్ ఫీజు వల్ల చెన్నై, పరిసర ప్రాంతాల నుంచి కూడా ఎంతోమంది శుక్లాల ఆపరేషన్లకు, కంటి జబ్బు చికిత్సకు రావడం జరుగుతుంటుంది.

? వైద్యవృత్తిలో మీరు మరచిపోలేని సంఘటనలు

! నేను ఇప్పటిదాకా 80వేల కాటరాక్ట్ ఆపరేషన్లు చేశాను. వృత్తిలో మరచిపోలేని, మరపురాని సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఒకసారి నేను మా హాస్పిటల్‌లోని నా రూమ్‌లో ఉండగా, ఒక అరవై యేళ్ల వృద్ధుడు వచ్చి హఠాత్తుగా కాళ్ళమీద పడి నమస్కారం చేశాడు. దాంతో అవాక్కై ఎందుకిలా చేశారని అడిగితే ఆయన జవాబు నా హృదయాన్ని కదిలించింది. 'డాక్టర్‌గారూ! నా కన్ను ఒకటి కనిపిస్తుందంటే అది మీ చలవే. కంటి చికిత్స కోసం ఒక హాస్పిటల్‌కి వెళ్లి ఒక కంటి చూపును శాశ్వతంగా కోల్పోయాను. మరో కంటి చికిత్సకు ఎక్కడికి వెళ్లాలనే సందిగ్ధంలో కొన్ని ఆస్పత్రుల పేర్లు రాసి ఆ చీటీలను సాయిబాబా విగ్రహం ముందు పెట్టి తీసిన ఓ చీటీలో మీ ఆస్పత్రి పేరు వచ్చింది. ఆ రోజు మీరే నా కంటికి చికిత్స చేసి చూపు ప్రసాదించారు' అని ఆ వృద్ధుడు చెప్పడమే కాకుండా నెలకోసారి వచ్చి కలిసి కృతజ్ఞతలు వ్యక్తం చేస్తుంటాడు.

? దీపావళిలో బాణసంచా ప్రమాదాలు ఎదురైనప్పుడు ఏం చేయాలి

! దీపావళి సమయంలో ఎంతోమంది పిల్లలు, పెద్దలు బాణసంచా కాలుస్తూ ప్రమాదాల బారిన పడుతుంటారు. అవి కాల్చేవారికే కాకుండా చూసేందుకు సమీపంలో ఉన్నవాళ్ళ కళ్ళకు కూడా అపాయం జరుగుతుంటుంది. సున్నితమైన కంటికి ఏ [illegible] గాయమైనా, నిప్పురవ్వలు పడినా, మరేదైనా ప్రమాదాలు జరిగినా వెంటనే హాస్పిటల్‌కి వెళ్లి వైద్యుని సంప్రదించాలి. సొంత వైద్యం, ఇంటివైద్యం చేయకుండా, సత్వరం కంటి ఆస్పత్రికి తీసుకెళ్లాలి. ఆలస్యం చేసినా, నిర్లక్ష్యం చేసినా శాశ్వతంగా కంటి చూపు కోల్పోవాల్సిన పరిస్థితులు ఏర్పడవచ్చు.

? బాణసంచా కాల్చేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి

! బాణసంచా కాల్చే సమయంలో అప్రమత్తత ఎంతో అవసరం. చిన్నారులను ఒంటరిగా వదలకూడదు. వారు పెద్దల పర్యవేక్షణలోనే టపాసులు కాల్చేలా చూడాలి. బాణసంచా కాల్చేటప్పుడు కళ్ళకు తప్పనిసరిగా కళ్ళజోడు ధరించాలి. బాణసంచా నుండి వచ్చే పొగ కళ్ళకు హానికరం. పొగ ఎక్కువగా ఉన్న ప్రదేశాలకి దూరంగా ఉండాలి.సురక్షితమైన ప్రత్యామ్నాయాలు, పర్యావరణ అనుకూల బాణసంచా వాడటం శ్రేయస్కరం. పటాసుల్లో భారీ లోహాలు, బొగ్గు, సల్ఫర్ ఉంటాయి. ఈ రసాయనాలు కళ్ళకు హానికలిస్తాయి. వీలైనంత వరకు అటువంటి బాణసంచా కాల్చకుండా ఉండటం మేలైన పద్ధతి. బాణసంచా గురించి, వాటివల్ల జరిగే ప్రమాదాల గురించి పిల్లలకు తెలియజేసి వారు కూడా తగిన జాగ్రత్తలు పాటించేలా చూడాలి.

? కళ్ళు ఆరోగ్యంగా ఉండాలంటే ఏం చేయాలి

! సర్వేంద్రియానాం నయనం ప్రధానం.. కళ్ళు ఎంతో ముఖ్యమైనవి, సున్నితమైనవి. వాటిపట్ల అశ్రద్ధ కూడదు. మితంగా పుష్టికరమైన ఆహారం, వ్యాయామం క్రమబద్ధంగా చేయాలి. కంటి పరీక్షలు చేయించుకుంటూ అవసరమైతే కళ్ళజోడు తప్పనిసరిగా వాడుతుండాలి. కంటి చూపు మందగించితే నిర్లక్ష్యం చూపకుండా కంటి వైద్యులని సంప్రదించాలి. శుక్లాలు ముదరకుండా ఆపరేషన్ చేయించుకోవాలి. ఏ విధమైన కంటి సమస్యలు ఎదురైనా, డాక్టర్‌ని కలిసి చికిత్స చేయించుకోవాలి. ముందస్తు పరీక్షలతో కళ్ళసమస్యల బారినుండి రక్షణ పొందవచ్చు.

అంకితభావంతో పని చేస్తే విజయం తథ్యం

● వీఐటీ వైస్ ప్రెసిడెంట్ జీవీ సెల్వం

వేలూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎంచుకున్న మార్గంలో అంకితభావంతో పని చేస్తే విజయం సాధించవచ్చని, ఏ వృత్తి చేస్తున్నామనేది ముఖ్యంకాదని, నిబద్ధత, క్రమశిక్షణతో చేస్తున్నామనేదే ముఖ్యమని వీఐటీ వైస్ ప్రెసిడెంట్ జీవీ సెల్వం సూచించారు. వీఐటీ వైస్‌ప్రెసిడెంట్ జీవీ. సెల్వం జన్మదినం సందర్భంగా వేలూరులోని తలైమణి పేరవై, నారాయణి ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో తమిళనాడు వైద్య సంక్షేమ సంఘం, హెయిర్ డ్రెస్సింగ్ వర్కర్స్ అసోసియేషన్ సభ్యులకు శుక్రవారం ఉదయం వైద్యశిబిరం నిర్వహించారు. నారాయణి మెడికల్ గ్రూప్ అధ్యక్షుడు డాక్టర్ బాలాజీ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి వేలూరు మాజీ కలెక్టర్ శివగామి, వీఐటీ వైస్ ప్రెసిడెంట్ జీవీ.సెల్వం ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివగామి మాట్లాడుతూ.. ప్రజలు ఆదాయానికి మించి ఖర్చుచేస్తున్నారని, అత్యాధునిక వసతులతో కూడిన విద్య రాష్ట్రంలో అందుబాటులో ఉన్నా, ప్రజలు తమ పిల్లలను శిక్షణ కోసం విదేశాలకు పంపిస్తున్నారన్నారు. అనంతరం వీఐటీ వైస్ ప్రెసిడెంట్ జీవీ.సెల్వం మాట్లాడుతూ.. తల్లిదండ్రులు ఎప్పుడూ పిల్లల మంచే కోరుకుంటారని, పిల్లలు బాధపడితే వారు తట్టుకోలేరని, బిడ్డ ఏడ్చినప్పుడు తల్లి సంతోషపడే ఏకైక సమయం ఆ బిడ్డ పుట్టినప్పుడేనన్నారు. జన్మల్లోకెల్లా మానవజన్మ ఉత్తమమైనదని, సమయాన్ని వృధా చేయకుండా పరులకు సహాయపడాలని ఆయన సూచించారు. వర్కర్స్ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించామని, శిబిరంలో పాల్గొని తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అందరికి ధన్యవాదాలు తెలిపారు.



కార్యక్రమంలో వీఐటీ నిర్వాహకులు

రూ.3018 కోట్లకు పెరిగిన ఇండియన్ బ్యాంక్ నికర లాభం

ఇండియన్ బ్యాంక్ ఎండీ బినోద్‌కుమార్



చెన్నై, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గత సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసిక ఫలితాలను బట్టి ఇండియన్ బ్యాంక్ నికర లాభాలు 11.49 శాతం పెరిగి రూ.3018 కోట్లకు చేరిందని ఆ బ్యాంక్ ఎండీ బినోద్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటించారు. బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం కూడా 5.76 శాతం అధికమై రూ.6551కోట్లకు చేరిందని చెప్పారు. బ్యాంక్ జారీచేసిన రుణాలు సైతం గత యేడాది ద్వితీయ త్రైమాసిక ఫలితాల కంటే 12.65 శాతం పెరిగి రూ.62,0324 కోట్లకు చేరిందని వివరించారు. బ్యాంక్ డిపాజిట్లు కూడా గత యేడాదికంటే 12.09 శాతం అధికమై, 7,76,946 కోట్లకు పెరిగిందని తెలిపారు. ఇదే విధంగా రూ.3,75,660ల దాకా ఆర్ఏఎమ్ రుణాలు పెంచినట్లు బినోద్ కుమార్ పేర్కొన్నారు.

కొడైకెనాల్‌ను కప్పేసిన మంచుదుప్పటి



చెన్నై, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతం కొడైకెనాల్‌లో శుక్రవారం వేకువజాము నుండి ఉదయం ఎనిమిది గంటల వరకు దట్టమైన మంచు కప్పివేయడంతో ప్రజలు, వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు. నాలుగు రోజులుగా కొడైకెనాల్ అంతటా చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో కెనాల్ రోడ్డు, మూంజికల్, అన్నాసాలై. అబ్జర్వేటరీ, ఉకార్తేనగర్, ఆనందగిరి, శీనివాసపురం, కవి త్యాగరాజర్ రోడ్డు, బస్‌స్టేషన్, లాస్‌కాట్ రోడ్డు, కళ్లకుళి తదితర ప్రాంతాలు, వత్తలకుండు - పళని మెయిన్‌రోడ్డులో శుక్రవారం ఉదయం దట్టమైన మంచు అలముకుంది. ఈ మంచు కారణంగా స్థానికులు చలితో వణికిపోయారు.

పంజాబ్ సీఎంకు స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు

చెన్నై అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ శుక్రవారం జన్మదినం జరుపుకుంటున్న సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు తన ఎక్స్ పేజీలో ఆయన ఓ సందేశం పొందుపరిచారు. భగవంత్ మాన్ సుఖసంతోషాలతో సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని మనసారా కోరుకుంటున్నారని స్టాలిన్ పేర్కొన్నారు.

డీఎంకే పాలనలో ప్రజలకు మిగిలేది హల్వానే

● ఈపీఎస్ యెద్దేవా



అసెంబ్లీ బయట డూప్లికేట్ హల్వాప్యాకెట్లతో ఈపీఎస్ తదితరులు

చెన్నై, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే రాష్ట్రంలో తయారైన దగ్గుమందు సేవించి మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని, ఈ అంశంపైతాను అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీయడానికి ప్రయత్నిస్తే మాట్లాడేందుకు అనుమతించలేదని అన్నాడీఎంకే సభాపక్షనేత మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ధ్వజమెత్తారు. శుక్రవారం ఉదయం అన్నా డీఎంకే సభ్యులంతా వాకౌట్ చేసిన తర్వాత అసెంబ్లీ వెలుపల ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ డీఎంకే పాలనలో ప్రజలకు మిగిలేది పాలకులు చెబుతున్న మోసపూరిత హల్వాలాంటి తీయటి మాటలే తప్ప కార్యాచరణలో ఎలాంటి చర్యలుండవని అంటూ తమ పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన తిరునల్వేలి హల్వా కవర్‌లాంటి హల్వా కవర్ ప్రదర్శించారు. ఇరుట్టుకడై హల్వా అని ముద్రించడానికి బదులుగా ఒరుట్టుకడై హల్వా (అబద్ధపు మాటల దుకాణం)అని ఉన్న హల్వా కవర్ పట్టుకుని డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయన నినాదాలు చేశారు. ఆ తర్వాత ఆయన మాట్లాడుతూ కాంచీపురంలో ప్రైవేటు కంపెనీ తయారు చేసిన దగ్గు మందు కారణంగా 25 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోవటానికి డీఎంకే ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. దగ్గు మందు తయారు చేసిన కంపెనీలో రెండేళ్లకు పైగా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి తనిఖీ చేయకుండా నిర్లక్ష్యం చేసిందని, ఫలితంగానే ఆ చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ఈ అంశంపై శాసనసభలో సావధాన తీర్మానం తీసుకువచ్చినా ఆరోగ్య మంత్రి, ముఖ్యమంత్రి సరైన సమాధానాలు తెలుపకుండా ఏవేవో మాయమాటలు చెప్పి మభ్యపుచ్చారని, ఈ విషయాన్ని తెలిపేందుకే హల్వా కవర్లను ప్రదర్శించామని ఈపీఎస్ వివరణ ఇచ్చారు.



సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలిసి పంజాబ్‌లో నవంబర్‌లో జరుగనున్న సిక్కుల గురువు గురు తేగ్ బహదూర్ 350వ సంస్మరణ వేడుకలకు ఆహ్వానిస్తున్న ఆ రాష్ట్ర ప్రజాపనుల శాఖ మంత్రి ఎస్.హర్‌భజన్‌సింగ్, నీటి వనరుల శాఖ మంత్రి బీరేందర్ కుమార్

అరణ్య ఆత్మను తెలిపే 'వైల్డ్ తమిళనాడు' డాక్యుమెంటరీ

చెన్నై, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుందరం ఫాస్టెనర్స్ లిమిటెడ్ నిర్మాణంలో, కల్యాణ్ వర్మ దర్శకత్వంలో రూపొందిన 'వైల్డ్ తమిళనాడు' డాక్యుమెంటరీ రాష్ట్ర అరణ్య ఆత్మను, దాని శక్తివంతమైన పర్యావరణ వ్యవస్థలను, ప్రజల-ప్రకృతి మధ్య లోతైన బంధాన్ని సంగ్రహిస్తుందని సుందరం ఫాస్టెనర్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆరతి కృష్ణ పేర్కొన్నారు. ఇటీవల నగరంలో ఈ డాక్యుమెంటరీ ప్రీమియర్ ప్రదర్శన సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సహజ వారసత్వాన్ని రక్షించే చొరవకు మద్దతివ్వడాన్ని తాము గర్విస్తున్నామన్నారు. మన గ్రహాన్ని రక్షించడానికి ఇదొక కొత్త నిబద్ధత ప్రేరేపిస్తుందని తాము ఆశిస్తున్నామని వివరించారు.

డాక్యుమెంటరీ ప్రదర్శన సందర్భంగా కల్యాణ్‌వర్మ, ఆరతి కృష్ణ తదితరులు



కష్టానికి తగిన ఫలితం

● దర్శకుడు మిత్రన్ ఆర్.జవహర్



ఆడియో రిలీజ్ వేడుకలో సిద్ధూ, మిత్రన్ ఆర్.జవహర్ తదితరులు

ప్రతి ఒక్కరికి కష్టానికి తగిన ఫలితం ఉంటుందని 'ది డార్క్ హెవెన్' చిత్రం ఆడియో రిలీజ్ ఫంక్షన్‌లో అతిథిగా పాల్గొన్న 'తిరు చిత్రాంబలం' దర్శకుడు మిత్రన్ ఆర్.జవహర్ అన్నారు. కొత్తై ఎంటర్‌టైన్మెంట్, ఎంఎస్ స్విస్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలో సిద్ధూ, దర్శిక, రిత్విక, వేల రామమూర్తి, నిళల్‌గళ్ రవి, అరుల్‌జ్యోతి, జయకుమార్, శరణ్, జానకీరామన్, విజయ్ సత్య, ఆర్తి, సుష్మిత తదితరులు నటించారు. ఈ చిత్రానికి కథ సమకూర్చి బాలాజీ దర్శకత్వం వహించారు. ఆయన గతంలో 'డీ-3' సినిమా రూపొందించారు. ఈ ఆడియో రిలీజ్ వేడుకలో దర్శకుడు మిత్రన్ ఆర్.జవహర్ మాట్లాడుతూ, 'సినిమాను ప్రేమించేవారు పరిశ్రమలోకి అడుగు పెట్టి తమ ప్రతిభ నిరూపించుకోవాలని పరితపిస్తుంటారు. కష్టపడేతత్వం ఉన్న ప్రతి ఒక్కరూ సినిమాల్లో రాణిస్తారు. ప్రతి ఒక్కరి కష్టానికి తగిన ప్రతిఫలం దక్కుతుందన్నారు. చిత్ర దర్శకుడు బాలాజీ మాట్లాడుతూ, 'తిరునెల్వేలి జిల్లాలోని ఓ కుగ్రామం నుంచి సినిమా అంటే ఏమాత్రం ఇష్టం లేని కుటుంబం నుంచి ఇంతదూరం వచ్చాను. ఎంతో ఎమోషనల్‌గా ఉంది. ఈ కథకు సరిగ్గా సరిపోతుందని భావించే ఇంగ్లీష్ టైటిల్ పెట్టాను. ఈ సినిమాను పూర్తి చేయడానికి అన్ని విధాలుగా సహకరించి ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలన్నారు. హీరో సిద్ధూ మాట్లాడుతూ, 'నా సినీ కెరీర్ ప్రారంభించి మంచి అవకాశం కల్పించిన దర్శకుడు జవహర్ మిత్రన్‌కు ఎన్నటికీ రుణపడివుంటాను. ఆయన పరిచయం చేయడం వల్లే నేను ఇంతదూరం వచ్చాను. నా భార్య శ్రేయ ఎంతగానో సహకరిస్తోంది. ప్రతి ఒక్కరూ రియాలిటీకి అనుగుణంగా నడుచుకోవాలి' అని కోరారు. 'మంచి చిత్రాలకు థియేటర్లు కేటాయించి, నిర్మాతలను ప్రోత్సహించాలని థియేటర్ యజమానులకు చిత్ర నిర్మాతలు విజ్ఞప్తి చేశారు. హీరోయిన్ దర్శిక మాట్లాడుతూ, 'బిగ్‌బాస్'లో ఎంట్రీ ఇవ్వడం వల్లే నాకు హీరోయిన్‌గా అవకాశం వచ్చింది' అన్నారు.

చిత్రజ్యోతి

28 యేళ్ల తర్వాత 'అరుణాచలం' కాంబో రిపీట్?



సుందర్ సి, రజనీకాంత్

కోలీవుడ్‌లో 28 యేళ్ళ తర్వాత సూపర్‌స్టార్ రజనీకాంత్, దర్శకుడు సుందర్ సి కాంబినేషన్‌లో మరో చిత్రం రానుంది.ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చేందుకు చర్చలు జగుతున్నాయి. 1997లో వీరిద్దరి కాంబోలో 'అరుణాచలం' సూపర్‌హిట్ మూవీ వచ్చిన విషయం తెల్సిందే. ఆ తర్వాత వీరిద్దరూ కలిసి పనిచేయలేదు. ఇపుడు మరోమారు కలిసి పనిచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ చిత్రాన్ని వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషన్, ఐశ్వర్య కలిసి నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు ఖరారైతే మాత్రం 28 యేళ్ళ తర్వాత మళ్ళీ వీరిద్దరి కాంబినేషన్‌లో ఓ చిత్రం రూపుదిద్దుకోనుంది. ప్రస్తుతం రజనీకాంత్, సుందర్ తమ తమ ప్రాజెక్టుల్లో బిజీగా ఉన్నారు. ఇవి పూర్తి చేసిన తర్వాత ఈ కొత్త ప్రారంభంకానుంది.

దర్శకుడిగా కరుణాస్ కుమారుడు



తండ్రి కరుణాస్‌తో కెన్ కరుణాస్

సీనియర్ నటుడు, రాజకీయ నేత కరుణాస్ కుమారుడు కెన్ కరుణాస్ దర్శకుడిగా అవతారమెత్తారు. ఈ మూవీలో హీరోగా కూడా నటిస్తున్నారు. పర్వత ఎంటర్‌టైన్మెంట్, స్ట్రీట్ బాయిస్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించనున్నట్టు వెల్లడించారు. పాఠశాల నేపథ్యంలో కామెడీ, ఫుల్ ఫన్ మూవీగా తెరకెక్కించనున్నారు. ఇందులో నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను వెల్లడించాల్సివుంది. కాగా, కెన్ కరుణాస్ గతంలో 'అసురన్', 'విడుదలై-2', 'వాత్తి' వంటి చిత్రాల్లో నటించి శెభాష్ అనిపించుకున్నారు. ఇపుడు తన స్వీయ దర్శకత్వంలో హీరోగా తనను తాను నిరూపించుకునేందుకు సిద్ధమయ్యారు.

లొకేషన్‌లో కీర్తి సురేష్ బర్త్‌డే వేడుకలు



ప్రముఖ హీరోయిన్ కీర్తి సురేష్ బర్త్‌డే వేడుకలు ఆమె నటిస్తున్న కొత్త చిత్రం షూటింగ్ లొకేషన్‌లో శుక్రవారం జరిగాయి. జీ స్టూడియోస్, డ్రమ్‌స్టిక్ ప్రొడక్షన్స్ పతాకంపై కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో వెడిక్కారన్‌పట్టి ఎస్.శక్తివేల్, ఉమేష్ కుమార్ ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రవీణ్ ఎస్ విజయ్ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సినిమా షూటింగ్ ముమ్మరంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో అక్టోబరు 17, శుక్రవారం కీర్తి సురేష్‌తో పాటు చిత్ర దర్శకుడు ప్రవీణ్ ఎస్.విజయ్ బర్త్ డే కావడంతో చిత్ర యూనిట్ సభ్యులు భారీ కేక్ కట్ చేసి వీరిద్దరి పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కీర్తి సురేష్‌కు యూనిట్ సభ్యులంతా పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, వివాహమైన తర్వాత కీర్తి సురేష్ వరుస చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్న విషయం తెల్సిందే.

శ్రీవారికి విరాళంగా కొప్పెర గంగాళం



తిరుమల/తిరుపతి రూరల్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి శుక్రవారం కొప్పెర(హుండీ) గంగాళం విరాళంగా అందింది. తిరుపతి సమీపంలోని కొప్పెరవాండ్లపల్లెకు చెందిన కొప్పెర సాయిసురేష్ ఈ హుండీ గంగాళాన్ని ఆలయ పోటు పేష్కార్ మునిరత్నంకు అందజేశారు. రాగి, ఇత్తడి కలిపి తయారు చేసిన ఈ హుండీ బరువు 70 కిలోలు ఉంటుందని, దీని విలువ రూ.2.50 లక్షలని దాత తెలిపారు. తాము 1821 నుంచి వంశపారంపర్యంగా స్వామికి కొప్పెర గంగాళాలను సమర్పిస్తున్నామని వివరించారు. అంతకుముందు కొప్పరవాండ్లపల్లెలోని వినాయకస్వామి ఆలయంలో కొప్పెర వంశస్థులు ఈ గంగాళానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 8వ తరానికి చెందిన సాయిసురేష్ కుటుంబీకులు ఈ గంగాళాన్ని తిరుమలకు తీసుకెళ్లారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు





తల్లితో నారా రోహిత్ - లతా బస్వరాజ్ పాట్నే

తిరుమల, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. హైదరాబాద్ సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్(క్యాట్) జ్యుడిషియల్ సభ్యురాలు లతా బస్వరాజ్ పాట్నే, ఆర్ఎస్ఎస్ సీనియర్ ప్రచారక్ మంగేష్, జాతీయ బాలల హక్కులు, సంరక్షణ కమిషన్ సభ్యులు ఆర్జీ ఆనంద్, సినీ హీరో నారా రోహిత్ ఉన్నారు.

దర్శనానికి వెళ్లి.. మా ఆయన తిరిగి రాలేదు!



శ్రీనివాస్ (ఫైల్ ఫొటో)

● రెండున్నర నెలల తర్వాత తిరుమల పోలీసులను ఆశ్రయించిన కాకినాడ జిల్లా వాసి

తిరుమల, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): 'తిరుమల శ్రీనివాసుడి దర్శనానికి వెళ్లిన మా ఆయన తిరిగి రాలేదు. ఆచూకీ తెలిస్తే చెప్పండి' అంటూ కాకినాడ జిల్లాలోని తాళ్లరేవు మండలం నీలపల్లి గ్రామానికి చెందిన పల్లా శ్రీదేవి కోరుతున్నారు. ఈ మేరకు ఆమె శుక్రవారం తిరుమల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త పల్లా శ్రీనివాస్(32), కొడుకుతో కలిసి ఆగస్టు 2న తిరుమలకు చేరుకున్నట్టు చెప్పారు.ఆలయంలోకి తాను రాకూడదని శ్రీదేవి చెప్పడంతో కుమారుడిని భార్యకు జత చేసి,పీఏసీ1 వద్దనున్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏటీఎం దగ్గరే కూర్చోమని చెప్పి పల్లా శ్రీనివాస్ దర్శనానికి వెళ్లా రు. ఆ తర్వాత ఎంతకీ ఆయన తిరిగి రాలేదు. ఇద్దరి దగ్గరా సెల్‌ఫోన్లు లేవు. తాము కనిపించలేదని సొంతూరికి వెళ్లిపోయి ఉంటాడని ఆమె బిడ్డతో కలిసి తమ గ్రామానికి చేరుకున్నారు. భర్త ఆచూకీ లేకపోవడంతో అనేక ప్రాంతాల్లో విచారించాక శుక్రవారం తిరుమలకు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పల్లా శ్రీనివాస్ ఆచూకీ తెలిసిన వాళ్లు 94407 96772, 0877 2289031 నెంబర్లకు తెలియజేయాలని కోరారు.

ఉరకలెత్తిన ఉత్సాహం

● ఎస్వీయూలో సాంస్కృతిక ప్రదర్శనల హోరు

● నేటితో ముగియనున్న యువతరంగ్





పాడుతా.. తీయగా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రెండో రోజైన శుక్రవారం యువతరంగ్- 2025 కార్యక్రమం వైభవంగా సాగింది. సాంస్కృతిక పోటీల్లో విద్యార్థులు తమ కళా ప్రదర్శనలతో హుషారెత్తించారు. ఇండియన్ గ్రూప్ సాంగ్, వెస్ట్రన్ గ్రూప్ సాంగ్, వెస్ట్రన్ సోలో ఇన్‌స్ట్రుమెంటల్, ఇండియన్ క్లాసికల్ డాన్స్, ఫోక్ డాన్స్, ట్రైబల్ డాన్స్‌తోపాటు వక్తృత్వం, చర్చాగోష్ఠి, స్పాట్ పెయింటింగ్, కార్టునింగ్ వంటి పోటీలు నిర్వహించారు. భారీ సంఖ్యలో హాజరైన స్థానిక విద్యార్థులతో వర్సిటీలో సందడి నెలకొంది. ఆయా కార్యక్రమాల్లో స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీవీ మురళీధర్, కల్చర్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ రంజిత్ కుమార్, స్వరూప్, డాక్టర్ ఉదయ్, రాజశేఖర్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో నేడు: మిమిక్రీ, మైమ్, స్కిట్, ఏకాంకిక, ఫోక్ ఆర్కెస్ట్రా, క్రియేటివ్ కొరియోగ్రఫీ, క్విజ్, క్లే మోడలింగ్, రంగోలీ వంటి పోటీలను శనివారం నిర్వహిస్తారు. కాగా, శనివారం జరిగే ముగింపు కార్యక్రమానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ విజయభాస్కరరావు హాజరు కానున్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు.



యువత ఉత్సాహం



ఎస్వీయూలో నేడు సాధారణ పని వేళలు

ప్రతి మూడో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎస్వీయూలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తుంటారు. యువతరంగ్ సందర్భంగా సాధారణ పని వేళలు (ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు) ఉంటాయని రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.





సుబ్రహ్మణ్య స్వామికి కావళ్ల మొక్కు - జాతరమ్మో జాతర







పంచెకట్టు అదుర్స్

జనసేన బహిష్కృత నేత అరెస్టు

వెంకటగిరి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణానికి చెందిన జనసేన బహిష్కృత నేత గూడూరు వెంకటేశ్వర్లును పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని ఉద్దేశించి సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా ఆయనను టీడీపీ నుంచి సస్పెండ్ చేయడంతో పాటు కోట వినుతకు న్యాయం చేయాలని పోస్టులు పెట్టాడు. దీనిపై ఫిర్యాదు అందడంతో వెంకటేశ్వర్లును అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు.

రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రేణిగుంట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఇక్కడి ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌రెడ్డిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో చిత్తూరు డీఐజీ, తిరుపతి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. నిషేధిత జాబితాలోని భూములను కోర్టు ద్వారా తెచ్చుకున్న ఆర్డర్లను దొడ్డిదారిలో చూపి రిజిస్ట్రేషన్లు చేసినట్లుగా గుర్తించినట్లు తెలిసింది. అలాగే రిజిస్ట్రేషన్ నెంబర్లు పెండింగ్ ఉన్నట్లు సమాచారం. తిరుపతి రూరల్‌లోని దేవదాయ శాఖకు సంబంధించిన నిషేధిత జాబితాలోని సర్వే నెం.242లో నిర్మించిన డూప్లెక్స్ విల్లాలు, భవంతులకు రిజిస్ట్రేషన్లు చేసినట్లు గుర్తించినట్లు చెబుతున్నారు. పలు రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వాదాయానికి గండిపడడాన్ని తనిఖీల్లో గుర్తించినట్లు తెలిసింది. కాగా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌రెడ్డి సెలవుపై విజయవాడకు వెళ్లడం గమనార్హం. ఈ తనిఖీల వివరాలను వెల్లడించడానికి అధికారులు నిరాకరించారు.

సీనియర్ల మంచి సలహాలను అనుసరించండి

● సన్మాన సభలో విశ్రాంత సీఎండీ సంతోషరావు



తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): ఏ సంస్థలోనైనా సీనియర్ల మంచి సలహాలను అనుసరించినప్పుడు మంచి ఫలితాలు వస్తాయని సదరన్ డిస్కం విశ్రాంత సీఎండీ కె.సంతోషరావు తెలిపారు. రేణిగుంట మండలం తూకివాకం సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారులకు, రైతులకు, పారిశ్రామిక వేత్తలకు ఉత్తమ సేవలందించామని చెప్పారు. అధికారుల నిర్ణయాలు క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా పర్యవేక్షించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని విశ్రాంత సీఎండీలు కలాల రంగనాథం, పి.గోపాల్‌రెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా విశ్రాంత సీఎండీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె.గురవయ్య, రామమోహనరావు, సీజీఎంలు శోభావాలంటీన, రమణాదేవి, ఉమాపతి, ఆదిశేషయ్య, జానకిరాం, జీఎం ఎం.కృష్ణారెడ్డి, ఎస్ఈలు ఎస్. రమణ, వి.చంద్రశేఖర్‌రావు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

పంచాయతీ సెక్రటరీ



వింటేజ్ కపుల్ శివాజీ, లయ మరోసారి కలసి నటిస్తున్న చిత్రం నిర్మాణదశలో ఉంది. ఈటీవీ విన్‌తో కలసి శివాజీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయన పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్‌గా నటిస్తున్నారు. దీపావళి పండగ సందర్భంగా ఈ చిత్రం నుంచి శివాజీ లుక్ విడుదల చేశారు. తన కుటుంబంతో కలసి దీపావళి పండగ సెలబ్రేట్ చేసుకోవడానికి పటాసులు తీసుకెళుతున్న లుక్ అది. అన్యాయాన్ని సహించని వ్యక్తిగా, నిజాయతీపరుడిగా శివాజీ ఇందులో నటిస్తున్నారు. భార్యాబిడ్డలే అతని ప్రపంచం, వాళ్ల కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడని వ్యక్తి పాత్రలో శివాజీ అభినయం ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు సుధీర్ శ్రీరామ్ చెప్పారు. చిత్రం టైటిల్, ఇతర విశేషాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. అలీ, ధనరాజ్, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

వంద శాతం హిట్ కొడతాం



సుధీర్ బాబు

సుధీర్ బాబు ప్రధాన పాత్రధారునిగా దర్శక ద్వయం వెంకటేశ్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'జటాధర'. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. తాజాగా ప్రిన్స్ మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో భూత పిశాచాలు, శాపగ్రస్త ఆలయాలు, ఆధ్యాత్మిక యుద్ధాలను కళ్లు తిప్పుకోలేని విధంగా చూపించారు. సుధీర్ బాబు నేలపై ఉన్న రక్తం తాగుతూ తపస్సులోకి వెళ్లే సన్నివేశం ఒళ్లు జలదరింపజేస్తుంది. భయానక సన్నివేశాలతో పాటు భారతీయ పురాణ వైభవాన్ని కూడా అద్భుతంగా తెరకెక్కించారు. అనంతరం నిర్వహించిన వేడుకలో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. అంతకు మించిన భావోద్వేగాలుంటాయి. ధన పిశాచి పాత్రలో సోనాక్షి సిన్హా అదరగొట్టారు. ప్రేక్షకుల డబ్బులకు విలువ ఇచ్చినప్పుడు సినిమా వంద శాతం విజయం సాధిస్తుంది. 'జటాధర' కూడా వంద శాతం హిట్ కొడుతుంది. నవంబరు 7న కుటుంబ సభ్యులందర్నీ సినిమాకు తీసుకెళ్లండి' అని అన్నారు. నటి శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత 'జటాధర'తో తెలుగులో నటించడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

సందేశాత్మకం

జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. దైవ నరేశ్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'మా సినిమా ప్రచార చిత్రాలకు చక్కని స్పందన వచ్చింది. కథానుసారం తెలంగాణ యాసలో కొన్ని పాత్రలు పలికిన సంభాషణలను కొందరు విమర్శించారు, కానీ సినిమా ఎవరినీ కించపరిచేలా ఉండదు. సందేశాత్మకంగా ఉంటుంది' అని చెప్పారు. త్వరలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు తెలిపారు.



విజయం సాధించాం



సిద్ధు జొన్నలగడ్డ

"తెలుసు కదా' సినిమా చేయాలని అనుకున్నప్పుడు నా మనసులో ఒక భయం ఉండేది. ఆ భయం యాక్టర్‌గా కాదు రైటర్‌గా. ప్రతీ సన్నివేశంలో పంచులు లేకుండా ప్రేక్షకుల్ని మెప్పించగలమా అనే సందేహం ఉండేది. ఈ రోజు ఆ భయం పోయింది. థియేటర్ల ఎదుట హౌస్‌ఫుల్ బోర్డులు చూస్తుంటే మేము విజయం సాధించామనే ఆనందం కలిగింది. సినిమాకు అన్ని చోట్ల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర దర్శకురాలు నీరజ కోన మాట్లాడుతూ 'సినిమాకు వస్తున్న స్పందనను చూస్తుంటే చాలా ఎమోషనల్‌గా ఉంది. చిత్ర కథలో మేము కనెక్ట్ అయిన పాయింట్‌తో ప్రేక్షకులు కూడా అంతే అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. మా నిర్మాతలు విశ్వ గారు, కృతి గారు, హీరో సిద్ధు, హీరోయిన్లు రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి, చిత్ర బృందం మొత్తానికి కృతజ్ఞతలు' అని అన్నారు. నటుడు వైవా హర్ష మాట్లాడుతూ 'మా చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని చెప్పారు.



అనుబంధాలను ఆవిష్కరించే చిత్రం

'నేను నటించే సినిమాలు చాలా బావుంటాయి అనే ఇమేజ్‌ను ప్రేక్షకుల దగ్గర తెచ్చుకోవాలనేదే నా ప్రయత్నం. అది 'కె-ర్యాంప్' చిత్రంతో పూర్తిగా నెరవేరుతుందనే నమ్మకం ఉంది. కుటుంబ అనుబంధాలను తెరపై గొప్పగా ఆవిష్కరించే చిత్రమిది' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వం వహించిన చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. జైన్స్ నాని మాట్లాడుతూ 'మా సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే ప్రచార చిత్రాలతో మంచి ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమాలో డైలాగ్స్ ప్రేక్షకులకు బాగా నచ్చాయి. వాటిని ప్రేక్షకులు చెబుతుంటే చాలా సంతోషంగా అనిపించింది. ప్రథమార్ధంలో ప్రేమకథ, ద్వితీయార్ధంలో కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.